# ఇప్పటి మానవుని పరిస్థితి

నేటి కాలములో మానవ జీవితము అర్థరహితమైనది. చాలామంది "ధనమూలమిదం జగత్" అను సూత్రము ప్రకారము ఉదయము లేచింది మొదలు తిరిగి నిదురించు వరకు ధనార్జన మీదనే లగ్నమైయున్నారు. చేతనైనంత సంపాదిస్తునే ఉన్నారు. సంవత్సరములు గడుస్తూనే ఉన్నవి. శరీరములో మార్పు వస్తూనే ఉన్నది. కాని ఏ మానవుడు తనను గూర్చి తాను ఏమాత్రము యోచించడము లేదు. పుట్టుచున్న వారిని చూస్తున్నాము. మరణించుచున్న వారిని చూస్తున్నాము. మనము కూడ ఏదో ఒక రోజు మరణించవలసిందేయని తెలుసు. మరణించిన శవమును విచిత్రముగ మనము చూచినట్లు మన శరీరము కూడ ఒకనాడు శవమైనపుడు మిగతావారు విచిత్రముగ చూస్తారని ఆలోచించలేదు. మరణించినవాడు ఏమి తీసుకపోలేదని తెలుసు. మనము కూడ తీసుకపోమని తెలుసు అయినా ప్రతి మనిషి మరణమును మరచి తను స్థిర స్థాయిగవుండువానివలె నిత్యము ప్రపంచములో లగ్నమైయున్నాడు. ఏదో ఒక పనిచేయుచు అంతో ఎంతో డబ్బు సంపాదిస్తు, ఇంటిలోని భార్యపిల్లలే సంతోషము కలుగజేయువారని తలంచుచు, తన తెలివినుపయోగించు పరిధి తన సంసారము వరకేననుకొన్నాడు. తన సంసారము సుఖజీవనమైన చాలునని తలచి నిత్యము పనిచేయువాడు బావిలోని కప్పవలె ఉన్నాడని తలంచవచ్చును. తనకు తెలిసిన సంసార జీవితమే గొప్పనుకొన్నవాడు, బయటి ప్రపంచము తెలియని కూపస్థ మండూకమేనని చెప్పవచ్చును.

జీవితమంటే ఏమని మరణాంతము వరకు యోచించినవారు, మానవ జీవితము శాశ్వితము కాదని గుణముల ప్రభావమువలనే మానవుడు శాశ్వితమైన వాటిని తెలుసుకోలేక అశాశ్వితమైన వాటియందే మునిగి అవియే గొప్పవను కుంటున్నాడని తలచినవారు, మామూలు మానవులవలె కాక ప్రత్యేకమైన మార్గమును అన్వేషించుచున్నారు. మానవుని తెలివి ఒక సంసార జీవితమును గూర్చి యోచించడమే కాదు, సారమైన తన రహస్యమును గూర్చి తెలియడమని యోచించుచున్నారు. మనిషి పుట్టినపుడు సంతోషించి, మరణించినపుడు శవముపైపడి ఏడ్వడమేనా మనపని! అని ఆలోచించి జనన మరణ రహస్యముల గురించి ఆలోచించుచున్నారు. అజ్ఞానము అంధకారమైన జీవితమును కలుగజేస్తుందని తెలిసినవారు జ్ఞానమార్గమును చేరి నేను ఎవరు? నా రహస్యమేమి? నాపని చస్తూ పుట్టుచుండడమేనా? ఈ భార్య పిల్లలు, సంసారము ఎంతవరకు నా స్వంతము? నిత్యము అన్ని చూపులు కేంద్రీకరించి గొప్పగ లెక్కించుకొంటున్న ధనము ఎంతవరకు నాకు ఉపయోగపడుచున్నది? అని యోచించి అన్నిటికంటే అతీతమైన సత్యము కొరకు అన్వేషిస్తున్నారు. ఎంత ఉండినప్పటికి ఆత్మశాంతిలేదని గ్రహించిన వారు శాంతి ఎక్కడ లభించుచున్నదోనని వెతుకుచున్నారు. ఈ విధముగ మానవుడు చేరిన మార్గమే జ్ఞానమార్గము. జ్ఞానమార్గములో చేరినవారు కొద్దిగ జ్ఞానము తెలుసుకొని గడిచిన తన జీవితమును తలపోసి ఎంతకాలము అజ్ఞానములో గడిపితినని పశ్చాత్తాపపడుచున్నారు.

నేటికీని జ్ఞానము తెలియని కొందరు తెలిసినవారిని తిక్కవారిగ, తెలివితక్కువ వారిగ లెక్కించుచు హేళనగ మాట్లాడుచున్నారు. బయటి వారే కాక సమీప బంధువులు సహితము మా మాదిరి బతకలేక ఈ విధముగ తిరిగినారని అవహేళన చేయుచున్నారు. అజ్ఞాన జీవితమే గొప్పదనుకొన్నవారు జ్ఞానజీవితము యొక్క ఔన్నత్యమును తెలియక జ్ఞానులను చిన్నచూపు చూస్తున్నారు. అటువంటి అజ్ఞానుల గురించి మేమేమనుచున్నానంటే!

చక్రవర్తియైన విశ్వామిత్రుడు అనుభవించిన సుఖములకంటే, సంసారముకంటే మరియు అతనికి గల ధన ధాన్య ఆస్తులకంటే మనము గొప్పవారమా? సువిశాలమైన రాజ్యమును పరిపాలించు విశ్వామిత్రుడు, ఎంతో మంది సేవకుల సైన్యము కల్గిన విశ్వామిత్రుడు, అందవతియైన భార్యగల విశ్వామిత్రుడు, తన మాటను ప్రజల పాలిట శాసనముగ మార్చి ఆచరింపజేయు విశ్వామిత్రుడు, సామంతరాజులకు, శత్రురాజులకు సింహసమానుడైనవాడు పరాక్రమములో అందరికంటే మించిన విశ్వామిత్రుడు, ఎంత చిన్న విషయమునైన సూక్ష్మముగ గ్రహించు శక్తిగల తెలివైన విశ్వామిత్రుడు, మానవ అజ్ఞాన జీవితములో ఎన్నివుండిన, శాంతి ఆత్మబలములేదని, ఆత్మశక్తిలేనిది ఎంత రాజైనా ఒక్క జ్ఞానికంటే అధముడేనని తెలిసి, అన్నిటిని వదలి జ్ఞానమార్గమును ఆశ్రయించగా, జ్ఞానమార్గము ఎంత గొప్పదో ఒక్కమారు ఆలోచించండి.

విశ్వామిత్రునికున్న సువిశాలమైన రాజ్యము గొప్పదా? మనకు గల కొన్ని ఎకరముల భూమి గొప్పదా? కొంత భూమి ఉన్నవాడు కూడనేనేమి చేయుచున్నాను? నా విలువెంతయని యోచించక జ్ఞానులను తక్కువ వారిగ లెక్కించడము చెట్టు మీదనున్న కోతి క్రిందనున్న సింహమును ఎక్కిరించినట్లుంటుంది. విశ్వామిత్రునంతటి వాడు ఈ మార్గములో శాంతిలేదని విడిచిపోవగ కొద్దిమాత్రము డబ్బుంటేనే నాకంటే గొప్ప ఎవడను అహమును పొందు మానవుడు **"బురదలోని పంది నాయంత సుఖము ఎవరు అనుభవించలేదనుకొన్నట్లు"** ఉండును. అజ్ఞానులకంటే దూరముగ ఉండవలయునని అజ్ఞానులతో కలియని జ్ఞానులను చూచి తెలివి తక్కువవారిగ భావించుకోవడము బురద పూసుకొన్న పందిని చూచి దూరముగ పోవు మనిషిని చూచి పంది నన్ను చూచి బయపడి దూరము పోవుచున్నాడనుకొన్నట్లుండును. దొంగతనము చేయువారుండగ, అల్లరిగ తిరుగువారుండగ, నీచపనులు చేయువారుండగ వారిని గురించి మాట్లాడుకోక ప్రత్యేకించి జ్ఞానులను విమర్శించువారు మంచివాసన కోర్చని పేడ పురుగుతో సమానమని చెప్పవచ్చును. జ్ఞానులకు ఏమాత్రము సాటికాని అజ్ఞానులు జ్ఞానుల విలువను గుర్తించలేక. తమనే గొప్పవారిగ భావించుకొనుచున్నారు. జ్ఞానులకు అజ్ఞానమంటే ఏమిటి? జ్ఞానమంటే ఏమిటని రెండూ తెలుసు కాని అజ్ఞానులకు వేమనయోగి "తాళకం బెరుగరు, తగరం బెరుగరన్నట్లు" జ్ఞానము తెలియదు, అజ్ఞానము తెలియదు. ఏమి తెలియనివాడు తెలివిమంతుడా? తెలిసినవాడు తెలివిమంతుడా? గౌతమ బుద్దుడు అన్ని విధముల యోచించి జ్ఞానముకంటే నీచమైనది అజ్ఞానమని రాజ్యమును, భార్యని, పుత్రుని అర్ధరాత్రి వదలి వెళ్లాడే? ఆయన తినేదానికి లేదా? కట్టేదానికి లేదా? ఏలేదానికి రాజ్యము లేదా? అన్నీ ఉండినా ఎందుకు త్యజించాడని ఒక్కమారు యోచించండి.

అన్నిటిని చవిచూచిన కృష్ణుడు కూడ జ్ఞానమును గూర్చి గీతగ బోధించాడు. జ్ఞానులను తిక్కవారిగ లెక్కించు అజ్ఞానులు జ్ఞానము బోధించిన కృష్ణునికంటే తెలివైనవారా? కొద్దిమాత్రము డబ్బు, కొద్దిమాత్రము ఆస్తి, కొద్దిమాత్రము తెలివియున్న మామూలు మానవుడు తనకున్న ఏ కొద్ది దానిమీద మమకారము వదలక వాటియందే లగ్నమై వాటియందే మునిగి తేనెలో చిక్కిన ఈగవలె నిత్యము అశాంతితో విలపిస్తున్నాడు. అన్నిటియందు గొప్పవారైన రాజులు సహితము తెలియనితనము నీచమైనదని, జ్ఞానము గొప్పదని చెప్పగా కొద్దిగ ఇల్లు, కొద్దిగ ఆస్తి, కొద్దిగ తెలివియున్న వారు జ్ఞానులను లెక్కించనంత మాత్రమున, నిందించినంత మాత్రమున ఏమీ కాదు.

ఇప్పటికైన, మానవుడు జరుగుచున్న కాలమును చూచి మృత్యువు దగ్గర కొస్తున్నదని తెలిసి, నేనింతవరకు పుట్టి ఏమి సాధించానని విమర్శించుకొని పశుపక్షి మృగాదులవలె తనుకూడ తిండికోసమే ప్రాకులాడక మానవ జీవితము సారాంశమైనదని నిరూపించవలెను. తెలివైనవారు, రాజులైన వారు, గురువులైనవారు గొప్పదని చెప్పిన జ్ఞానమార్గమును చేరవలెను. జ్ఞానము తెలియకపోయినా, తన్నుతాను "నేనేమి చేయుచున్నాను? తాతలు తండ్రులు సంపాదించినట్లే సంపాదిస్తూ వారు తినినట్లే తినుచూపోయిన ఏమి ఫలము? ఇంతేనా మానవ జీవితము? కష్టసుఖములకంటే మించినదేమైన మన జీవితములో తెలుసుకొన్నామా"యని ఆలోచించవలెను. చదువుచున్న మీరు ఆలోచిస్తారు కదా! మీరు జ్ఞానులైతే, అన్నీ మీకు తెలిసియుంటాయి. మేము చెప్పనవసరములేదు. మీరు ప్రత్యేకించి ఇతరులకు జ్ఞానము తెల్పుటకు ప్రయత్నించండి. అజ్ఞానులు వినరు. వినకపోగా దూషిస్తారు కదా! రోగమున్న పిల్లవానికి మందుపోస్తే ఊరక తాగుతాడా? తాగడు బయటికిమూసి, పోసేవారిని దూషిస్తాడు కదా! అవును. అజ్ఞాన రోగులు 'జ్ఞానమందు' ఇష్టపడరు. 'జ్ఞానమందు' వారికి చాలా చేదుగవుంటుంది. చిన్నపిల్లలను బుజ్జగించి మందలించి చివరకు కొట్టి అయినా మందు త్రాపి రోగము పోగొట్టునట్లు ఈ అజ్ఞానులను వదలకూడదు. నయమునో లేక భయమునో ఏ విధముగనైన వారికి జ్ఞానము తెల్పడము తెలిసిన జ్ఞానుల లక్ష్యము. మందు త్రాగువాడు త్రాగించువారిని ఇబ్బంది పెట్టినట్లు జ్ఞానము తెల్పునపుడు తెలియనివారు ఇబ్బంది పెట్టడము సహజమే. అందులకు ఈ సమాజములో ఓర్పు, సహనము అవసరము. చూడండి, వదలని పట్టుతో జ్ఞానము తెల్పవలయునను మమ్ములను ఈ పుస్తక ప్రచురణ వ్యాపారంటున్నారు. మీరిచ్చు డబ్బు గొప్పదా? ఇపుడు తెలుపు జ్ఞానము గొప్పదా? ఎట్లు చెప్పిన జ్ఞానమే గొప్పది. అయినా మేము జ్ఞానమునకు డబ్బు అడగలేదు. కాగితముల పుస్తకమునకే డబ్బు, అందులోని జ్ఞానమునకు కాదు. జ్ఞానమునకు ఎంత డబ్బు ఇచ్చినాచాలదు. జ్ఞానమునకు విలువ కట్టలేము. అందువలననే గీతలో దేవుడు 'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్య తే' జ్ఞానమునకు సమానమైనది, దానికంటె పవిత్రమైనది లేదన్నాడు. ఎన్ని యుగములు మారిన జ్ఞానమునకు సమానమైనది లేదూ... లేదూ.. లేదు.. అందువలననే జనకుడు, విశ్వామిత్రుడు, గౌతమ బుద్ధుడు రాజులైనప్పటికీ జ్ఞానమును గౌరవించారు. నాటి రాజులకంటే నేటి మానవుడు గొప్పవాడా? ఎట్టి స్థితిలోనున్నాడో మీరే యోచించండి. ఇందూధర్మప్రధాత, సంచలనాత్మక రచయిత, త్రైతసిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వ్రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీతను మరియు ఆయన గ్రంథములను చదవండి. అసలైన ఆత్మజ్ఞానము తెలియండి.

**జననముతో వచ్చిన అందము మరణముతో మాసిపోతున్నది.**

**జన్మించక మునుపు మరణించిన తర్వాత నీవు ఎవరో తెలుసుకో.**

ఇట్లు

ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక